జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' ఫోన్‌ఇన్

సంగారెడ్డి జోన్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వాటిని కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు, సలహాలు, సూచనలు తీసుకోవడానికి మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్‌కి నేరుగా ఫోన్ చేసి పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవచ్చు.

తేది: 17-09-2024
సమయం: మధ్యాహ్నం 2గంటల నుంచి 3:30 గంటల వరకు



ఫోన్ చేయాల్సిన నంబర్లు
7288894403, 9505872923



శివప్రసాద్,
జిల్లా వ్యవసాయాధికారి,
సంగారెడ్డి

న్యూస్‌రీల్

సెప్టెంబర్ 17ను కార్మిక దినోత్సవంగా ప్రకటించాలి

సంగారెడ్డి టౌన్: సెప్టెంబర్ 17ను భారత కార్మిక దినోత్సవంగా నిర్వహించాలని భారతీయ మాజుదుర్ సంఘ్ జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... కార్మికులకు, కులవృత్తులకు అని పనిముట్లు అందించిన మహోన్నతుడు విశ్వకర్మ అని, ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులతో మెట్టు శ్రీధర్

పటాన్ చెరు టౌన్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ ఆకాంక్షించారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ అంబేడ్కర్ కాలనీలోని బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. హాస్టల్‌లో వసతులు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.


ప్రపంచంలోనే బీజేపీకి అత్యధిక సభ్యత్వాలు



పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ బీబీ పాటిల్

జోగిపేట(అందోల్): ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగి ఉన్నది ఒక్క బీజేపీయేనని మాజీ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్యక్రమానికి ఆయన ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలంతా బీజేపీ వైపే ఉన్నారని, ప్రధాని నరేంద్రమోదీపై నమ్మకంతో కేంద్రంలో మూడవ సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. జహీరాబాద్ లోకసభ పరిధిలో అధికార కాంగ్రెస్ పార్టీకి బీజేపీ గట్టిపోటీ ఇచ్చిందన్నారు. ప్రతీ కార్యకర్తకు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం జోగిపేట పట్టణానికి చెందిన కొందరు యువకులు బీబీ పాటిల్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌గౌడ్, వెంకట నర్సింహరెడ్డి, గంగా జోగినాథ్, పోతులబొగుడ శంకర్, ప్రభాత్‌కుమార్, శివశంకర్, గోపాల్‌రావు, గాజుల నవీన్, ఉలువల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



ఎడ్ల బజార్ బసవేశ్వర మందిరంలో సామూహిక కుంకుమార్చన

సదాశివపేట(సంగారెడ్డి): వినాయక మండపాల వద్ద ఆదివారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో మండపాల వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు అధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న నరసింహారెడ్డి

నారాయణఖేడ్: ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు నరసింహారెడ్డి సూచించారు. ఆదివారం ఖేడ్ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరవ తరగతి నుంచే తనకు నైపుణ్యమున్న చదువుపై దృష్టిసారించాలని వివరించారు. జ్ఞాపక శక్తిని పెంచుకోవడానికి సూపర్ బ్రెయిన్ యోగా గురించి అవగాహన కల్పించారు. ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ ఎస్.రమేష్, కె.బాలమణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో అన్నీ కష్టాలే..!



చీలమామిడి గ్రామంలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం



అంన్‌వాడీ కేంద్రంలో ఓ పక్కన ఉన్న వంటగది

సొంత భవనాలు లేక అవస్థలు

- శిథిలావస్థలో అద్దె భవనాలు
- కేంద్రాల్లో వసతులు అంతంతే..
- పలుచోట్ల ఆగిన పక్కా భవన నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

కేంద్రాలు	1504
సొంత భవనాలు	577
అద్దెవి	476
ఉచిత భవనాలు	451
నూతనంగా మంజూరైనవి	105

సంగారెడ్డి జోన్: జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. చాలా కేంద్రాలు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అక్కడ కూడా వసతులు లేక అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఇక్కడ చిన్నారులకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పిస్తుంటారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలు అవస్థల కేంద్రాలుగా మారాయి.

అద్దె భవనాల్లో అరకొర వసతులు

అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక ఎక్కువ శాతం అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్నాయి. వాటిల్లో కూడా సరైన వసతులు లేక టీచర్లు, ఆయాలు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. చాలాచోట్ల అద్దెభవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని కేంద్రాలను ఇరుకైన గదిలో నిర్వహిస్తున్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల విద్యుత్ సదుపాయం లేక ఉక్కపోతతో పిల్లలు అవస్థ పడుతున్నారు. వంట చేయడానికి, పిల్లలను ఆడించడానికి స్థలం కూడా ఉండటం లేదు. తనిఖీలకు వచ్చే అధికారులు రికార్డులు చూస్తున్నారే తప్ప భవనాల దుస్థితిని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో సంవత్సరాలు గడుస్తున్నా వాటి నిర్మాణ పనులు మాత్రం పూర్తి కావడం లేదు.

105 భవనాలు మంజూరు

జిల్లాలో 105 కొత్త అంగన్‌వాడీ కేంద్రాల కోసం పక్కా భవనాలు మంజూరైనట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. సొంత భవనాలు ఉన్న 221 కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అందులో 100 పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అన్ని రకాల వసతులు కల్పించాలని ఇటీవల నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



కేంద్రాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అన్ని రకాల వసతులు కల్పించాలని సూచించాం. 105 కొత్తగా భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. శిథిలావస్థలో అద్దె భవనాలు ఉంటే ఇతర ప్రాంతాలకు మార్చాలని చెప్పాం.

–లలిత కుమారి,
జిల్లా సంక్షేమ అధికారి, సంగారెడ్డి



వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

తెల్లబోయిన రైతు

ఈ సారి పత్తి దిగుబడిపై అధిక వర్షాల ప్రభావం

- పూత, కాత రాలి ఎర్రబారుతున్న పంట
- పెట్టుబడులు వచ్చే అవకాశం లేదని ఆవేదన

జహీరాబాద్ టౌన్: పత్తి రైతు ప్రతీ సంవత్సరం ఏదో విధంగా నష్టపోతూనే ఉన్నాడు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే చేతికి వచ్చే సమయంలోనే దెబ్బతింటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు పత్తి పంటను దెబ్బతీశాయి. పూత, కాత దశలో ఎడతెరపి లేని వాన కురడంతో పత్తి రైతు పరేషాన్ అవుతున్నాడు.

జహీరాబాద్ వ్యవసాయ డివిజన్‌లో పత్తి పంట అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఈ ఏడాది కూడా వానాకాలం ప్రారంభంలోనే విత్తనాలు చల్లుకున్నారు. గతేడాది కంటే ఈసారి పంట విస్తీర్ణం పెరిగింది. వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో ప్రారంభంలో పత్తి పంట పచ్చగా కళకళలాడింది. జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాల్లో సుమారు 75 వేల ఎకరాల్లో రైతులు పత్తిని వేశారు. పంట ఏపుగా పెరగడంతో దిగుబడులపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా వరకు పంట దెబ్బతింది. కొన్నిచోట్ల వరదలకు కొట్టుకుపోయింది. ఎదుగుదల లేకపోవడం, పూత, కాత రాలుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రంగు మారుతున్న పంట

భారీ వర్షాల వల్ల పత్తి పంట రంగు మారుతుంది. మరోవైపు పూత, కాత కూడా రాలుతుంది. ఖర్చులు కూడా పెరగడంతో కలుపు సమస్య వెంటాడుతుంది. మందుల పిచికారీ చేయడం, కలుపును తొలగించడానికి పొలంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే వేల రూపాయలు ఖర్చు చేసిన రైతులు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొక్కలో బలంలేక దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి కూడా రాదు

6 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. ఎకరానికి రూ.25 వేల చొప్పున రూ.1.50 లక్షలు పెట్టుబడికి ఖర్చు అయ్యింది. ఇంకా పెట్టుబడి పెట్టాల్సి ఉంది. పూత, కాత కూడా లేక దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. మొత్తానికి ఈ సారి పెట్టుబడి కూడా రాదు.

– మారుతి, రైతు, గుంజెట్టి

పంటంతా ఎర్రబారింది

భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతింది. పొలంలో నీరు నిలిచి చేనంతా ఎర్రబారింది. ఉన్న పంటను కాపాడుకునేందుకు ఇంకా పెట్టుబడులు పెట్టాలి. కానీ దిగుబడి ఆశాజనకంగా లేదు. పందుల బెడద కూడా ఉంది.

– బేత సతీష్, రైతు

శాంతి వాతావరణం అలవర్చుకోవాలి



హాజరైన భక్తులు



ప్రవచనం చేస్తున్న బసవలింగ అవధూత మహరాజ్

కల్హేర్(నారాయణఖేడ్): సమాజంలో ప్రతిఒక్కరూ శాంతియుత వాతావరణం అలవర్చుకోవాలని మల్లయ్య గిరి, దేగలమడి ఆశ్రమ పీఠాధిపతి మహాతపస్వీ డాక్టర్ బసవలింగ అవధూత మహరాజ్ హితబోధ చేశారు. శనివారం రాత్రి కల్హేర్‌లో ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు బసవలింగ అవధూత మహరాజ్‌కు ఘన స్వాగతం పలికారు. బసవేశ్వర మహరాజ్ విగ్రహానికి పూలమాల వేశారు. ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, మాజీ సర్పంచ్ లచ్చవ్వ, మాజీ ఎంపీటీసీ సంగప్ప, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎం.వీరశెట్టి, కె.సంగమేశ్వర్‌రావు, డి.కిషన్‌రావు, రమేష్‌గౌడ్, రఘువీర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్ రావు

పటాన్‌చెరు టౌన్: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పర్యావరణ వేత్త డాక్టర్ కిషన్ రావు స్మారక కమిటీ, కాలుష్య నివారణ సంఘర్షణ సమితి ఏర్పాటుచేసిన సంస్మరణ సభ కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ప్రముఖ పర్యావరణవేత్త, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, తెలంగాణ ప్రాంత సహ సద్భావ ప్రముఖ్ రామకృష్ణ, గోశాల చైర్మన్ దుర్గాప్రసాద్, పర్యావరణ వేత్త ప్రొఫెసర్ నరసింహారెడ్డి, మాజీ ఆర్టీఐ కమిషన్ సభ్యులు దీపక్ రెడ్డి, నరేందర్ రెడ్డి, గోదావరి ప్రభాకర్ పాల్గొన్నారు.

రూ.12.5లక్షలు పలికిన వినాయకుని లడ్డూ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వినాయక మండపాల వద్ద ఆదివారం లడ్డూల వేలం నిర్వహించారు. ఉర్జిత్ విలాస్‌లో ఓ వ్యక్తి వినాయక లడ్డూను రూ.12.5లక్షలకు కేవసం చేసుకున్నాడు. మైహోమ్స్ అంకురలో వినాయక లడ్డూను ఎన్.గణేష్ రెడ్డి రూ.6.51లక్షలకు, రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో వినాయక లడ్డూను పోన్నం కార్తీక్ రూ.4.58లక్షలకు దక్కించుకున్నారు.



మైహోం అంకురలో రూ.6.51లక్షలకు వినాయక లడ్డూను కైవసం చేసుకున్న గణేష్ రెడ్డి

గణేశ్ లడ్డూ దక్కించుకున్న ముస్లిం యువకుడు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామంలో గణేశ్ నిమజ్జనోత్సవం సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో లడ్డూను ముస్లిం యువకుడు దక్కించుకున్నాడు. విగ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఉంచిన రెండవ లడ్డూను గ్రామానికి చెందిన రైతు రశీద్ రూ.4,500కు వేలంపాడి దక్కించుకున్నాడు.



వేలంలో లడ్డూ దక్కించుకున్న రశీద్

మార్కెట్‌లో అల్లం దోపిడీ

క్వింటాలుకు 20 కిలోల తరుగు

- 19న ఉస్మాన్‌గంజ్ ముట్టడికి రైతుల తీర్మానం
- మంత్రులకు సమస్య విన్నవించాలని నిర్ణయం
- పడిపోయిన ధర, దోపిడీతో పెట్టుబడులు రాని వైనం



సమావేశమైన అల్లం రైతులు

జహీరాబాద్: అల్లం పండించే రైతులకు కష్టాలు తప్పడం లేదు. అష్టకష్టాలు పడి పండించిన పంటను మార్కెట్‌కు అమ్మకానికి తరలిస్తే అక్కడ దోపిడీకి గురవుతున్నారు. తరుగు పేరుతో నిలువునా దోచేస్తున్నారు. క్వింటాలు పంటకు 20 కిలోల తరుగు తీస్తున్నారని రైతులు వాపోతున్నారు. 120 కిలోల బరువుకు 100 కిలోల లెక్క కడుతున్నారంటున్నారు. 30 కిలోల పంటకు మూడు కిలోల తరుగు పేరుతో అదనంగా తరలించుకుంటున్నామని, దీన్ని ఏకంగా ఆరున్నర కిలోలకు పెంచారని రైతులు పేర్కొంటున్నారు. ఈ లెక్కన 120 కిలోల అల్లం ఉత్పత్తులను తరలిస్తే తరుగు పేరుతో 20 కిలోలు తగ్గించి ఒక క్వింటాలు కింద లెక్కకడుతున్నారని రైతులు వాపోతున్నారు. జిల్లాలోనే జహీరాబాద్ ప్రాంతంలో అల్లం పంట అత్యధికంగా సాగవుతోంది. సుమారు 3వేల ఎకరాల్లో ఈ పంట సాగులో ఉంది. గతేడాది జూన్ నెలలో సాగు చేసుకున్న పంటను తీసి విక్రయం నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మాన్‌గంజ్‌కు తరలిస్తున్నట్లు రైతులు తెలిపారు.

19న చలో హైదరాబాద్

మార్కెట్‌లో తరుగు పేరుతో అల్లం ఉత్పత్తుల దోపిడీని నిరసిస్తూ ఈనెల 19వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అల్లం రైతులు పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్‌లో వారు సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఉస్మాన్‌గంజ్ మార్కెట్‌ను ముట్టడించడం జరుగుతుందన్నారు. సుమారు 500 మంది వరకు తరలివెళ్లి నిరసన తెలపనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా మంత్రితో పాటు వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి తమ సమస్యను విన్నవిస్తామన్నారు.

కేరళ అల్లానికి తరుగు తీయడం లేదు

కేరళ రాష్ట్రం నుంచి రైతులు తీసుకువస్తున్న అల్లం ఉత్పత్తులకు మాత్రం తరుగు క్వింటాలుకు 10 కిలోలు మాత్రమే తీస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. జహీరాబాద్ నుంచి తీసుకెళ్లే అల్లానికి మాత్రం క్వింటాలు 20 నుంచి 22 కిలోల మేర తరుగు తీస్తున్నారంటున్నారు.

పడిపోయిన అల్లం ధర

నెల రోజుల క్రితం వరకు అల్లం క్వింటాలు ధర రూ.8 నుంచి రూ.9వేలు పలికిందని, ఇప్పుడు మాత్రం సగం మేర ధర పడిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. క్వింటాలు ధర పంట నాణ్యతను బట్టి రూ.3వేల నుంచి రూ.6వేలు మాత్రమే పలుకుతోందంటున్నారు. ఈ ధరలకు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తరుగు పేరుతో మరింత దోచుకోవడం అన్యాయమని అంటున్నారు. ఇప్పటికైనా కమీషన్ ఏజెంట్లు పాత విధానంలోనే తరుగు తీయాలని కోరుతున్నారు.



నారాయణఖేడ్: పట్టణంలో వినాయక విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర

జై బోలో గణేశ్ మహరాజ్‌కీ

జిల్లావ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల వద్ద నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రముఖులు పాల్గొన్నారు. కొన్నిచోట్ల విగ్రహాల శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు.



సంగారెడ్డి : పోతిరెడ్డిపల్లిలోని వినాయక మండపం వద్ద పూజలు చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ



సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): నాగారం గోపాల్, రాణి దంపతులు, కాలనీవాసులు స్వామి వారికి సమర్పించిన 65 రకాల నైవేద్యాలు

క్లుప్తంగా

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

- కాలేజీ ఉద్యోగిపై కేసు నమోదు, రిమాండ్

తూప్రాన్: కళాశాలకు సెలవు దినం అని తెలియక కళాశాలకు వచ్చిన విద్యార్థినితో ప్రైవేట్ కళాశాల ఉద్యోగి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ ఘటన ఆదివారం మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు, రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ శివానందరం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ కేంద్రంలో ఒక జూనియర్ కళాశాలలో విద్యార్థి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత నెల ఆగస్టు 26న కృష్ణష్టమి సెలవు దినం అని తెలియక కళాశాలకు వచ్చింది. కార్యాలయంలో ఉన్న ఉద్యోగి పర్వతాలు విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తిస్తే ఈ విషయాన్ని ఇంటికి వెళ్లాక తల్లిదండ్రులకు చెప్పింది. వారు ఆగస్టు 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈనెల 13న నిందితుడిపై పోక్సో కేసు నమోదు, ఆపై అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు విషయంలో పోలీసులు రహస్యంగా ఉంచడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లడ్డూ చోరీ చేద్దామని వస్తే..

- తగలబడిన వినాయక మండపం

ములుగు(గజ్వేల్): లడ్డూ చోరీ చేద్దామని వస్తే వినాయక మండపం తగలబడిన ఉదంతం సిద్దిపేట జిల్లా ములుగు మండలం దాసర్లపల్లిలో జరిగింది. ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపంలో శనివారం రాత్రి కొందరు మైనర్లు గణపతి చేతిలో లడ్డూ చోరీ చేయాలనుకున్నారు. లోపలికి వెళ్లిన వారు వినాయకుని విగ్రహం ఎదుట ఉన్న దీపానికి తగలడంతో కింద పడి మండపానికి మంటలు వ్యాపించాయి. ఏకంగా మండపం అంతా తగలబడిపోయి పూజలందుకున్న ప్రతిమ మంటల వల్ల పూర్తిగా మారిపోయింది. మైనర్ల పోకిరీ చేష్టల కారణంగానే ఈ ఘటన చోటు చేసుకుందని ఎలాంటి అపోహలకు పాల్పడవద్దని ఎస్‌ఐ విజయ్‌కుమార్ సూచించారు.

ప్రేమ విఫలమైందని ప్రేమికుడు ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ప్రేమ విఫలమైందని ప్రేమికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం ... ఒడిశాకు చెందిన బూడు భుయాన్(22) మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం వచ్చి వెలమల గ్రామ శివారులో ఉన్న ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్‌లో లేబర్‌గా పని చేస్తూ ఇక్కడే నివాసం ఉంటున్నాడు. ఈనెల 14న ఓ యువతితో ఫోన్‌లో మాట్లాడి రూమ్‌లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతను ఉండే రూమ్‌కు కొద్ది దూరంలో చెట్టుకు ఉరివేసుకొని విగతజీవిగా ఆదివారం కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బావమరిది అయిన పాత్రో తన బావ ఎవరో గుర్తుతెలియని యువతితో ఫోన్‌లో మాట్లాడేవాడని, ప్రేమ విఫలం కావడంతోనే జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా మృత్యువు కబళించింది

- ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి మృతి



రమేశ్

చేగుంట(తూప్రాన్): ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి నర్మితండాలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం నర్మితండాకు చెందిన మాలోత్ రమేశ్ (36) మాసాయిపేట శివారులోని చెట్లతిమ్మాయిపల్లి చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో నిజామాబాద్ నుంచి వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మహ్మదాపూర్ పర్యాటక కేంద్రం అయ్యేనా?

హుస్నాబాద్ రూరల్: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన పొలంపల్లి బిడ్డ అనభేరి ప్రభాకర్‌రావు, సాయుధ పోరాటానికి మొదట నాయకత్వం వహించి పోరాటాలతో నిజాం ప్రభుత్వాన్ని గడగడలాడించాడు. గ్రామాల్లోని భూస్వాములు, పెత్తందార్ల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు. భూమి కోసం, భుక్తి కోసం పోరు చేసి చివరకు రజాకార్ల తూటాలకు నేల కొరిగినా పేదల గుండెల్లో గూడు కట్టుకున్నాడు. అయితే మంగళవారం తెలంగాణ విమోజన దినోత్సవం సందర్భంగా కథనం..

- సాయుధ వీరులు అశువులు బాసిన నేల ఇది
- ఎత్తయిన గుట్టలు, ప్రకృతి సోయగాలు
- అందులోనే వీరుల సమాధులు
- వైఎస్ మరణంతో ఆగిన పర్యాటక కేంద్రం ప్రతిపాదనలు
- కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనైనా కదలిక వచ్చేనా?



మహ్మదాపూర్‌లోని అనభేరి ప్రభాకర్‌రావు,సింగిరెడ్డి భూపతిరెడ్డి సమాధులు

హుస్నాబాద్ నుంచి 5 కి.మీల దూరంలోనే మహ్మదాపూర్ ఉంది. ఊరు పొలిమేరలోని తొక్కుడు బద్దలు, సాకేర్ల వాగు దాటుకుంటూ కి.మీ దూరం వెళ్తే తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన వీరుల సమాధులు కనిపిస్తాయి. ఎత్తైన గుట్టలు, ప్రకృతి సోయగాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకొనే ప్రకృతి సౌందర్యం కోటగిరి గుట్టల సొంతం. ప్రతీ శ్రావణ మాసంలో పర్యాటకులు గుట్టల ప్రదేశానికి వనభోజనాలతో వచ్చి ఆనందంగా గడిపి నాటి తెలంగాణ వీరుల త్యాగాలను స్మరించకుంటారు. ప్రతీ ఏటా సీపీఐ అధ్వర్యంలో హుస్నాబాద్ నుంచి మహ్మదాపూర్ వరకు భారీ ర్యాలీ చేసి అమరుల వర్ధంతి సభ, తెలంగాణ విమోచన దినాన్ని ఘనంగా జరుపుకొంటారు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసి అమరులైన ఆ స్థలాన్ని పర్యాటక కేంద్రం చేయాలని కొంతకాలం నుంచి డిమాండ్ చేస్తున్నా ఆంధ్ర పాలకులు స్పందించలేదు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మహ్మదాపూర్‌ను పర్యాటక కేంద్రం చేస్తారని హుస్నాబాద్ ప్రాంత ప్రజలు ఆశించిన 10 ఏళ్ల పాలనలో పర్యాటక కేంద్రం ఊసే లేదు.

సాయుధ వీరులకు స్థావరం

తెలంగాణ విముక్తి కోసం నిజాం ప్రభుత్వ అరాచక పాలనను ఎదురించిన తెలంగాణ సాయుధ పోరాట వీరులకు, హుస్నాబాద్ ప్రాంతానికి ఒక చరిత్ర ఉంది. సాయుధ పోరాటంలో పేదల వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరు చేసిన కమ్యూనిస్టులు పోలంపల్లికి చెందిన అనభేరి ప్రభాకర్‌రావు, సిరిసిల్ల జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన సింగిరెడ్డి భూపతి రెడ్డిల దళాలు రజాకార్లతో పోరు చేస్తూ మహ్మదాపూర్‌కు చేరుకున్నాయి. మహ్మదాపూర్‌లో 14 మార్చి 1948లో పేద ప్రజలను చైతన్యం చేస్తుండగా రజాకార్లు సమాచారం తెలుసుకొని ఊరును చుట్టుముట్టి సాయుధ దళాలపై దాడులు చేశారు. రజాకార్లతో పోరు చేస్తూ గుట్టలకు వెళ్తున్న సాయుధులను వెంటబడి వేటాడి కాల్పులు జరపడంతో 12 మంది వీరులు అసువులు బాశారు. ఈ ఘటనతో హుస్నాబాద్ ప్రాంతానికి ప్రత్యేకత చోటు చేసుకుంది. వీరుల జ్ఞాపకార్థం అనాటి దళనాయకులైన అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి పేరుతో రెండు సమాధులు నిర్మించారు. ప్రతీ ఏటా వర్ధంతి రోజున సీపీఐ ఆధ్వర్యంలో వర్ధంతి సభలు నిర్వహిస్తూ అనాటి వీరుల త్యాగలను స్మరించుకుంటారు. సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవం జరుపుకొంటారు.

పర్యాటక కేంద్రం ఏర్పాటు చేయాలి

తెలంగాణ ప్రజల కోసం పోరాడి వీర మరణం పొందిన వీర భూమి ప్రదేశాన్ని పర్యాటక కేంద్రం చేయాలని నాటి ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ప్రతిపాదనలు పంపించారు. పర్యాటక కేంద్రానికి వైఎస్ సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఆ దిశగా ప్రయత్నం సాగుతున్న క్రమంలో మహా నేత మరణంతో పర్యాటక కేంద్రం అక్కడే ఆగిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కూడా వీరుల భూమికి పర్యాటక శోభ వస్తుందని ఆశపడ్డ హుస్నాబాద్ ప్రాంత వాసులకు నిరాశే ఎదురవుతోంది.

నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- శోభాయాత్రలో డీజేలు నిషేధం
- సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: గణేశ్ నిమజ్జన కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో ఈ నెల 16, 17వ తేదీల్లో జరగనున్న వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా శోభాయాత్ర రూట్‌లు, నిమజ్జన ప్రదేశాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లతో అన్ని చర్యలు చేపట్టామన్నారు. సిద్దిపేట కొమటి చెరువు, ఎర్ర చెరువు, గజ్వేల్ పట్టణం పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్ ఊర చెరువు, దుబ్బాక రామసముద్రం చెరువు, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, చేర్యాల కుడి చెరువుల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టామన్నారు. శోభయాత్రలో డీజేల వినియోగం, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. శోభాయాత్ర జరుగు ప్రదేశాల్లో, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వినాయక మండపాలను జియో ట్యాగింగ్ చేశామన్నారు. ప్రజలు, యువకులు, ప్రజాప్రతినిధులు వినాయక శోభాయాత్రను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాఫిక్ డైవర్షన్

- సోమ, మంగళవారాల్లో ట్రాఫిక్ డైవర్షన్ ఉంటుంది. తొగుట, ఎన్సాన్‌పల్లి గ్రామం నుంచి సిద్దిపేటకు వచ్చే వాహనదారులు బీజేఆర్ చౌరస్తా నుంచి పట్టణానికి రావాలి.
- మెదక్, రామాయంపేట, దుబ్బాక నుంచి వచ్చే వాహనదారులు రూరల్ పోలీసు స్టేషన్ బైపాస్ రోడ్డు, ఎల్లమ్మ టెంపుల్, వేములవాడ కమాన్, నర్సాపూర్ చౌరస్తా మీదుగా పట్టణానికి వెళ్లాలి.
- నాగదేవత టెంపుల్ చౌరస్తా నుంచి పట్టణానికి వచ్చే వారు ఎల్లమ్మ టెంపుల్, వేముల కమాన్ మీదుగా వెళ్లాలి. వాహనదారులు పోలీసుల సూచనలు పాటించి ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్ల ద్వారా వెళ్లాలని సీపీ సూచించారు.

అదుపు తప్పి ఆటో బోల్తా



రోడ్డు కిందికి దూసుకుపోయి బోల్తా పడిన ఆటో

నర్సాపూర్: ఆటో అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన మండలంలోని రెడ్డిపల్లి వద్ద ఆదివారం జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి నర్సాపూర్ మీదుగా మెదక్ వైపు వెళ్తున్న ఆటో అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకుపోయి బోల్తా పడింది. అందులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాల పాలైన వారికి ప్రాథమిక వైద్యం అందిన అనంతరం ఇళ్లకు వెళ్లిపోయారు. కాగా కొత్త ఆటో కొనుగోలు చేసి తీసుకుని వస్తుండగా ప్రమాదం జరిగిందని సమాచారం.

జోరుగా మట్టి దందా

- పట్టపగలే ట్రాక్టర్లలో తరలింపు
- అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'సాక్షి'
- వారి నుంచి కొరవడిన స్పందన
- అక్రమార్కులకు రాజకీయ నేతల అండదండలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



మండంలో అక్రమంగా ట్రాక్టర్‌పై మొరం తరలిస్తున్న దృశ్యం

వట్‌పల్లి(అందోల్): జోరుగా మట్టి దందా నడుస్తోంది. పట్టపగలే అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. సాధారణ పనిదినాల్లో అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని, సెలవు రోజుల్లో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారనే విషయాన్ని సాక్షి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

వట్‌పల్లి మండలంలో అక్రమ మొరం దందా విచ్చలవిడిగా సాగుతోంది. ఈ విషయమై స్థానికులు రెవెన్యూ శాఖకు చెందిన డిప్యూటీ తహసీల్దార్, ఆర్డీఓ, పోలీసు శాఖకు చెందిన సీఐల దృష్టికి 'సాక్షి' తీసుకెళ్లగా పట్టీపట్టనట్లు వ్యవహరించారు. వట్‌పల్లి మండల శివారులో నుంచి నాగులపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా జరుగుతోంది. దీని వెనుక అధికారులు, అధికార పార్టీకి చెందిన నాయకుల అండదండలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ లక్షలు గడిస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు ఉంటున్నారు. ఫిర్యాదులు చేస్తున్నా గానీ చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టపగలే మొరం తరలిస్తున్నా ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం విశేషం. అయితే ప్రభుత్వ పనిదినాలలో అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయని రూట్ మార్చి సెలవు దినాలలో యథేచ్ఛగా కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఈ విషయమై అందోల్ ఆర్డీఓ పాండు, సీఐ అనిల్‌కుమార్‌లను వివరణ కోరగా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీఓ మాత్రం గ్రామాల్లో తమ సిబ్బంది కొరత ఉంది తానే స్వయంగా వెళ్లాలా? అంటూ ఎదురు ప్రశ్నించారు.

భార్యపై అనుమానంతో హత్య

కూకట్‌పల్లిలో మట్టుబెట్టి.. అందోల్‌కు తరలించి..

- అనారోగ్యంతో మృతిచెందిందని నమ్మించే యత్నం
- మృతురాలి కుటుంబీకుల నిలదీతతో విషయం వెలుగులోకి
- ఫిర్యాదు మేరకు పోలీసుల అదుపులో నిందితుడు



ఇందిర (ఫైల్)



నిందితుడు నర్సింహులు

జోగిపేట(అందోల్): భార్యపై అనుమానంతో కూకట్‌పల్లిలో హత్య చేసి మృతదేహాన్ని అందోల్‌కు తరలించాడు. అనారోగ్యంతో చనిపోయిందని నమ్మించేందుకు యత్నించాడు. మృతురాలి కుటుంబీకులు అనుమానంతో నిలదీస్తే హత్య చేసిన విషయాన్ని బయటపెట్టాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అందోల్‌కు చెందిన వెండికోలు నర్సింహులు చాలాకాలంగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రాంతంలో స్థిరపడి ఇక్కడే నివసిస్తూ గ్యాస్ డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. 13 ఏళ్ల క్రితం మెదక్ జిల్లా చిట్కుల్‌కు చెందిన ఇందిర (33)ను వివాహం చేసుకున్నాడు. ఆమెకు సంతానం కలగకపోవడంతో ఐదేళ్ల క్రితం మరో మహిళను రెండో వివాహమాడాడు. దీంతో ఆమెకు ఇద్దరు సంతానం. ఈ క్రమంలో అతను కూకట్‌పల్లిలో మూడంతస్తుల భవనాన్ని నిర్మించాడు. అందులోనే ఇద్దరు భార్యలతో సంసార జీవితాన్ని గడుపుతున్నాడు. మొదటి భార్య ఆ భవనంలోనే కిరాణ షాపు నడుపుతోంది. కొన్ని రోజులుగా ఇందిరకు ఫోన్‌కాల్స్ ఎక్కువగా రావడంపై నర్సింహులు అనుమానం పెంచుకున్నాడు. దీనివల్ల కొంతకాలంగా ఇద్దరూ గొడవపడుతున్నారు. ఆదివారం కూడా గొడవ పడ్డారు. ఈ క్రమంలోనే కోపాద్రిక్తుడైన అతను టవల్‌ను గొంతుకు చుట్టి ఇందిరకు శ్వాస ఆడకుండా చేసి హత్య చేశాడు. కూకట్‌పల్లి నుంచి అందోల్‌కు మృతదేహం తీసుకెళ్లి అనారోగ్యంతో మృతిచెందినట్లుగా చెప్పే ప్రయత్నం చేశాడు. మృతురాలి కుటుంబీకులు అనుమానంతో గట్టిగా నిలదీస్తే తానే చంపినట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో మృతురాలి తల్లి మొగులమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా నర్సింహులుపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని విచారిస్తే నేరం ఒప్పుకున్నట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఇందిర మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బస్సు ఢీ కొని ఒకరి మృతి

- ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయాలైన యువకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలపరిధిలోని ఖలీల్‌పూర్ గ్రామశివారులో ఆదివారం చోటు చేసుకొంది. హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్ అస్టూర్‌కు చెందిన రోహన్, సాయికుమార్, సిద్దార్థ్ ముగ్గురు బైక్‌పై జహీరాబాద్ వైపు వస్తున్నారు. హైదరాబాద్(2)డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జహీరాబాద్ నుంచి బీదర్ వైపు వెళ్తోంది. ఖలీల్‌పూర్ గ్రామ శివారులో నారింజ బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను బస్సు ఢీ కొంది. దీంతో వాహనంపై ఉన్న ముగ్గురు కింద పడిపోయి గాయాలయ్యాయి.క్షతగాత్రులైన రోహన్, సాయికుమార్‌లను బీదర్ ఆస్పత్రికి, తీవ్ర గాయాలైన సిద్దార్థ్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా, సాయికుమార్ బీదర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ చనిపోయాడని సీఐ హనుమంతు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామానాయుడు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో పరిశ్రమలో మంటలు



మంటల్లో ధనలక్ష్మి పరిశ్రమ

రూ.30 లక్షల మేర ఆస్తి నష్టం!

మనోహరాబాద్(తూప్రాన్): షార్ట్ సర్క్యూట్ వల్ల పరిశ్రమలో మంటలు వ్యాపించి భారీగా ఆస్తినష్టం కలిగింది. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూచారం పరిశ్రామికవాడలో గల ధనలక్ష్మి ప్లాస్టిక్, ఫర్నిచర్ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. వెంటనే నర్సాపూర్ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలార్పారు. అప్పటికే పరిశ్రమ పూర్తిగా మంటల్లో చిక్కుకోవడం వల్ల రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, అందిన వెంటనే తదితర వివరాలను తెలుపుతామని ఎస్సై పేర్కొన్నారు.

కారు యూటర్న్ చేస్తుండగా..

వెనుక నుంచి ఢీకొన్న మరో కారు

- డివైడర్‌ను దాటి బస్సును ఢీ కొట్టి..
- బస్సు.. ఆటో, బైక్‌ను..



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కొండపాక(గజ్వేల్): వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ఘటన కొండపాక మండలం దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదారాబాద్ నుంచి కారు సిద్దిపేట వైపు అతివేగంగా వస్తోంది. దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై యూటర్న్ తీసుకోగా వెనుకాల వస్తున్న మరో కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో డివైడర్‌ను దాటి కుడి వైపునకు వెళ్లి సిద్దిపేట నుంచి హైదరాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ బస్సును కంట్రోల్ చేసే క్రమంలో ఆటోను, మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ వరుస ఘటనల్లో రెండు కార్లు, బైక్ దెబ్బతిన్నాయి. కారులో ఉన్న ఒకరికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న టోల్ ప్లాజా సిబ్బంది క్షతగాత్రుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన వల్ల రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయ కలిగింది. టోల్ ప్లాజా వారు నిలిచిపోయిన వాహనాలను పక్కకు జరపడంతో వాహనాలు రాకపోకలు సాగించాయి.

భార్య గొలుసు విడిపించేందుకంటూ వెళ్లి అదృశ్యం



అరుణ్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భార్య గొలుసు విడిపించేందుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీకి చెందిన అరుణ్ ఒక ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 13న ఇంటి నుంచి లింగంపల్లిలో ఉన్న బంగారం షాపునకు వెళ్తున్నానని, భార్య గొలుసు విడిపించుకొని వస్తానని చెప్పి బయటికి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోయే సరికి తెలిసిన వారిని, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు అదృశ్యంపై తండ్రి కృష్ణ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంకా వరద నీటిలోనే..



కొత్లాపూర్‌లో ఇంకా నీటిలోనే వైకుంఠధామం



కొత్లాపూర్ సేంద్రియ ఎరువు తయారీ కేంద్రం



కంది మండల కేంద్రంలోని ప్రకృతి వనం



సంగారెడ్డి జిల్లాలో గ్రామాలభివృద్ధి పేరుతో నిర్మించిన పల్లె ప్రకృతి వనాలు, సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాలు, వైకుంఠధామాలు నీటిలో మునిగాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. చెరువులు, కాలువల సమీపాన, లోతట్టు ప్రాంతాల్లో వీటి నిర్మాణాలు ఉండటం కూడా ఒక కారణమని తెలుస్తోంది. సంగారెడ్డి మండలం కొత్లాపూర్, కంది మండల కేంద్రంలో ఇప్పటికీ నీళ్లలోనే ఉన్నాయి. సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

గంగమ్మ చెంతకు బొజ్జ గణపయ్యలు



మిరుదొడ్డి(దుబ్బాక): తొమ్మిది రోజులుగా భక్తులతో ఘనంగా పూజలందుకున్న బొజ్జ గణపయ్యలు ఆదివారం గంగమ్మ చెంతకు బయలు దేరారు. గణేశుల శోభాయాత్రలకు భక్తులు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శోభాయాత్రలో చిన్నారులు మొదలుకొని మహిళలు, యువతీ యువకులు, పెద్దలు నృత్యాలు చేస్తూ అలరించారు. ఆయా ప్రధాన చెరువుల్లో గణపతులను భక్తి శ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేర్చారు.